క్లుప్తంగా

శ్రీరామచంద్రుడికి గరుడ సేవ



గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడి గ్రామోత్సవం

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరామచంద్రునికి గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. ఉభయకర్తలు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న సంతర్పణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

వింజమూరు (ఉదయగిరి): అంగన్‌వాడీ ఆయా పోస్టులకు కావలి, కందుకూరులో ఈ నెల 19, 20న ఇంటర్వ్యూలు జరగనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. 19న కావలిలో వింజమూరు, కలిగిరి మండలాలకు చెందిన అభ్యర్థులకు కావలి ఆర్డీఓ కార్యాలయంలో, కొండాపురం ఆయా పోస్టులకు కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 20న ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

పింఛన్లపై విచారణ



ఉదయగిరి: జలదంకి మండలంలోని కేశవరం సచివాలయాన్ని కావలి డీఎల్‌డీఓ ఎస్.కనకదుర్గాభవాని బుధవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయ పరిధిలోని పెండింగ్ పింఛన్లపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గ్రామాలకు తరలిరండి



కరపత్రాన్ని పంచుతున్న బీఎస్పీ నేతలు

చేజర్ల: బీఎస్పీ అధిష్టానం ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు గ్రామాలకు తరలిరండి అనే కార్యక్రమాన్ని మండలంలోని మడపల్లిలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్పీ ఆత్మకూరు నియోజకవర్గం అధ్యక్షుడు నందా ఓబులేసు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎన్నికల వరకు కొనసాగుతుందన్నారు. పార్టీ కరపత్రాన్ని పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నుపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి టి కృష్ణ, చేజర్ల మండలం అధ్యక్షుడు దివానపు వెంకటేశ్వర్లు, మండల నాయకులు చీకటి పెంచలయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

సీతారామపురం: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఏపీఓ సుభాషిణి, ఈసీ సువార్తయ్య బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వేసవిలో ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు నిర్వహించాలన్నారు. సిబ్బంది కూలీలకు గిట్టుబాటు కూలీ లభించే విధంగా పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ



బీమా నగదు అందిస్తున్న కామేపల్లి

వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగుల గ్రామ సచివాలయ పరిధిలోని జడదేవిలో మంగళవారం రాత్రి మృతి చెందిన మల్లికార్జున కుటుంబ సభ్యులకు బుధవారం వరికుంటపాడు సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీమా మిత్ర పాల్గొన్నారు.

దివ్యాంగులకు సమాజం అండగా ఉండాలి

- రాజ్యసభ సభ్యుడు బీద, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి



ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఆత్మనూన్యతాభావంతో ఉండకుండా సమాజంలో అందరిలా చైతన్యంతో జీవించేలా దివ్యాంగులకు సమాజం అండగా ఉండాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం దివ్యాంగులకు పరికరాలు పంపిణీకి అవసరమైన పరీక్షలు కోసం జరిగిన ప్రత్యేక శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వశాఖకు తాను లేఖ రాయడంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారని బీద మస్తాన్‌రావు చెప్పారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడతూ ఎంపీ బీద మాస్తాన్‌రావు చొరవ తీసుకోవడం వల్ల ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. మరో నాలుగు నెలల్లో ఈ శిబిరంలో ఎవరెవరికి ఎలాంటి పరికరాలు అవసరమో వాటిని అధికారులు దివ్యాంగులకు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండమ్మ, దివ్యాంగుల సంఘం నాయకులు పోసిన వెంకట్రావు, టీసీ మాల్యాద్రినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ విస్తృత తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణితో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కలెక్టర్ హరినారాయణన్ విస్తృతంగా పర్యటించి తనిఖీలు చేపట్టారు. తొలుత ఆదిమూర్తిపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను, మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయాల్సిన జగనన్న విద్యాకానుక కిట్స్ స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లి విద్యాకానుక కిట్స్‌లో ఏఏ సామగ్రి వచ్చి ఉన్నాయి. ఏఏ పాఠశాలలకు అందజేయాల్సి ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వేసవిలో ప్రజలకు అందించాల్సిన సేవలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బందికి సూచించారు. అనంతరం నేకునాంపేట జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను పరిశీలించి పలు సూచనలు, సలహాలందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సబ్ కలెక్టర్ శోభిక, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిశు సంరక్షణ ఏపీసీ ఉషారాణి, స్థానిక తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఎంపీపీ బొడ్డు అనూరాధ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ మత్స్యకార భరోసాలో కావలి టాప్

కావలి: మత్స్యకారులకు సముద్రంపై చేపల వేట నిషేధిత కాలంలో భృతి కోసం ప్రభుత్వం ఒక్కో మత్స్యకార కుటుంబానికి ఇస్తున్న రూ.10 వేల ఆర్థిక సహాయం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం లబ్ధిదారుల్లో జిల్లాలో కావలి నియోజకవర్గం టాప్‌లో నిలిచింది. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బటన్ నొక్కి లబ్ధిదారులైన మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదు జమయ్యేలా చేశారు. జిల్లాలో సమద్రతీరం ఉన్న కావలి, కోవూరు, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో ఎక్కువ సంఖ్యలో మత్స్యకారులు ఉన్న నియోజకవర్గం కావలిగా రికార్డుకెక్కింది. కావలిలో 4,912 కుటుంబాలకు రూ.4.912 కోట్లు నగదు జమయ్యాయి. కోవూరులో 3,028 కుటుంబాలకు రూ.3.028 కోట్లు, సర్వేపల్లిలో 1,800 కుటుంబాలకు రూ.1.800 కోట్లు, కందుకూరు నియోజకవర్గంలో 2,332 కుటుంబాలకు రూ.2.332 కోట్లు ఆర్థిక సహాయం అందింది.

పంచముఖశక్తి గణపతికి ప్రత్యేక పూజలు



పంచముఖశక్తి గణపతి దేవాలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని డీసీపల్లిలో కొలువైన ఉన్న శ్రీపంచముఖశక్తి గణపతి దేవస్థానంలో బుధవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా రేవూరు పోలిరెడ్డి, పద్మజ దంపతులు, వారి కుటుంబ వ్యవహరించారు. ఆలయ పూజారి పొశర్లపూడి వెంకటేశ్వర్లు, వేదపాఠశాల విద్యార్థులు పొశర్లపూడి సురేంద్ర, పొశర్లపూడి సుదర్శన్ స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంధన వినియోగాన్ని తగ్గించాలి



పెట్రోల్ బంకు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ ఎఫ్‌ఆర్‌ఓ రామకొండారెడ్డి

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న సంస్కరణలకు అనుగుణంగా వాహనదారులు ఇంధన వినియోగం తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునివ్వాలని ఆత్మకూరు అటవీశాఖ ఎఫ్ఆర్ఓ రామకొండారెడ్డి అన్నారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా మర్రిపాడులోని పెట్రోల్ బంకుల వద్ద బుధవారం వాహనదారులకు, స్థానికులకు ఇంధన వినియోగంపై అవగాహన కల్పించారు. పెట్రోల్, డీజిల్ తక్కువ వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అన్ని పెట్రోల్ బంకుల్లో ఉన్న వ్యర్థాలను తమ సిబ్బందితో కలిసి తొలగించి శుభ్ర పరిచారు. కార్యక్రమంలో మర్రిపాడు డీఆర్‌ఓ రవీంద్రబాబు, అటవీశాఖ బీట్ ఆఫీసర్లు మల్లికార్జునరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కలిగిరి: కలిగిరిలోని చిన్నచెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను కలెక్టర్ హరినారాయణన్ బుధవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. వేసవి తీవ్రత అధికం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హసనాపురం సమీపంలో ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సుమారు 7 కిలో మీటర్లు రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని, ఆ మార్గంలో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడాల్సిన వస్తుందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మరమ్మతులకు ప్రతిపాదనలు పెట్టి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరావు, ఎంపీడీఓ కళాధర్‌రావు, తహసీల్దార్ రామకృష్ణ, ఏపీఓ శ్రీనివాసులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ఉదయగిరి: మండలంలోని లింగమనేనిపల్లెకు చెందిన బరిగ సుబ్బరాయుడు ఇటీవల చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడి ఆత్మకూరు ఓ ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఎంపీటీసీ సభ్యురాలు కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య బుధవారం వైద్యఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును అందజేశారు.

పార్టీ గెలుపు కోసం కృషి చేద్దాం

- ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి



మాట్లాడుతున్న మెట్టుకూరు చిరంజీవిరెడ్డి

ఉదయగిరి: 2024 ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి అన్నారు. ఆయన ఉదయగిరిలో బుధవారం రాత్రి మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించిన అభ్యర్థి విజయానికి అందరం కలిసి కట్టుగా పనిచేద్దామన్నారు. పేద ప్రజలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఇందుకోసం గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మూలె వినయ్‌రెడ్డి, మూలె వీరారెడ్డి, మట్ల లక్ష్మయ్య, సంజీవరాజుతో పాటు పల్లాల కొండారెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో ‘విజ్ఞానం’ మెరుగు



విద్యార్థులతో పుస్తకాలను చదివిస్తున్న లైబ్రేరియన్, హెచ్‌ఎం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నాయి. గ్రంథాలయాలు విద్యార్థుల కోసం చిత్రలేఖనం, కథలు, పేపర్ క్రాఫ్ట్ వంటి సృజనాత్మక కృత్యాలను గ్రంథాలయ సిబ్బంది నేర్పిస్తుండడంతో పాటు విద్యార్థులకు అవసరమైన ఎన్నో రకాల పుస్తకాలను చదువుతున్నారు. స్థానిక ఎంపీపీ ప్రాథమిక హిందూ పాఠశాలలో బుధవారం విద్యార్థులతో నీతి కథలు, జీవిత చరిత్రలు చదివించి గ్రంథాలయ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, హెచ్‌ఎం కేసీ రాగయ్య తదితరులు ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

చేజర్ల(సోమశిల): వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అనంతసాగరం తహసీల్దార్ ఏవీ రమణారావు, ఎంపీడీఓ మధుసూదన్‌రావు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకల్లా పనులు పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎండలు తీవ్రత దృష్ట్యా బయటకు రాకూడదని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ఏఎన్‌ఎంల నుంచి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలన్నారు.

ఉపాధి లక్ష్యాలను సాధించాలి

- ఏపీడీ నిర్మలాదేవి



రికార్డులు పరిశీలిస్తున్న నిర్మలాదేవి

ఉదయగిరి: ఉపాధి హామీ సిబ్బంది వారికి కేటాయించిన లక్ష్యాలను నూరుశాతం సాధించాలని ఏపీడీ నిర్మలాదేవి అన్నారు. ఆమె బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలు రోజుకు కనీసం నాలుగు గంటలు కొలతల ప్రకారం పని చేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు తాగు నీరు, నీడ వసతి కల్పించాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేటాయించిన లక్ష్యాలు బాధ్యతగా పనిచేసి సాధించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు.

ఎంపీటీసీలకు నిధులు మంజూరు చేస్తాం

- ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ

వరికుంటపాడు: మండలంలోని ఎంపీటీసీ ప్రాదేశికాలకు అవసరాన్ని బట్టి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానని ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ చెప్పారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీపీ నిధులు రూ.56,71,002 లక్షలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని అవసరాన్ని బట్టి గ్రామ సచివాలయాల వారీగా నిధులు మంజూరు చేస్తామన్నారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. తాను మండల పరిషత్ నిధులకు సంబంధించి సమాచారం ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా అడిగినా ఇంతవరకు సమాచారం ఇవ్వలేదని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దేవనబోయిన మధు సభలో ఆవేదన వ్యక్తం చేశాడు. వరికుంటపాడు సర్పంచ్ కె.దిలీప్‌కుమార్ విద్యుత్‌గృహ నిర్మాణం, వైద్యారోగ్యశాఖ, రెవెన్యూ, సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఎంపీఓ విజయభాస్కరరావు, తహసీల్దార్ అబ్దుల్‌హమీద్, ఎంఈఓ షావుద్దీన్, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం పాల్గొన్నారు.

నడిరోడ్డుపై మినీట్రక్కు బోల్తా



జాతీయ రహదారిపై బోల్తాపడిన మినీట్రక్కు

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): నెల్లూరు నుంచి మర్రిపాడుకు సరుకులు తీసుకెళ్తున్న ఓ మినీ ట్రక్కు వెనుక టైరు పగలడంతో అదుపుతప్పి 67వ నంబరు జాతీయ రహదారిపై నడిరోడ్డుపైనే బోల్తాపడింది. ఈ ఘటన మర్రిపాడు–పొంగూరుకండ్రిక మధ్యలో బుధవారం జరిగింది. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి వాహనంలో ఇరుక్కోపోయిన డ్రైవర్‌ను అద్దాలు పగులగొట్టి బయటికి తీశారు. డ్రైవర్‌కి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. మర్రిపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపుదాం

- లబ్ధిదారులతో అవగాహన సమావేశం



ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నవరత్నాలు పథకాల్లో భాగంగా పేదలు అందరికీ ఇళ్లు నిర్మించేందుకు ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి పురోగతి చూపాలని మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని సచివాలయాల్లో ఇళ్ల లబ్ధిదారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. కమిషనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నెల్లూరుపాళెం, పమిడిపాడు లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల పనులు 60 శాతం పూర్తయ్యాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు వారికి కావాల్సిన సదుపాయాలన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగాలేని పొదుపు మహిళలకు రుణ సహాయం సైతం అందిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నిర్మాణ పనుల్లో సమస్యలేవైనా ఎదురైతే వెంటనే తెలియజేయాలని వాటిని పరిష్కరించేందుకు మున్సిపల్, హౌసింగ్ సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు ఆయన వారికి హామీ ఇచ్చారు. ప్రతి వారం తాను స్వయంగా ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతిని పరిశీలిస్తానని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నటరాజ్, టీపీఓ చంద్రశేఖర్, మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, మెప్మా సీఓ మాధవి, అలీ బేగ్, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులైన మహిళలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం ఆమని చిరువెళ్లలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతసాగరం పీహెచ్‌సీ వైద్యురాలు వరలక్ష్మి గ్రామంలోని ఇళ్ల వద్దకే వెళ్లి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విటమినులు ఉండే కాయకూరలు, ఆకుకూరలు తినాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి రోజూ టెంకాయ నీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసకోవాలన్నారు. వీలైనంత వరకు చల్లటి ప్రదేశంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సుబ్బారెడ్డి, పద్మావతి

సీతారామపురం: మండలంలోని సంజీవరెడ్డినగర్‌లో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సిమెంట్ రోడ్డు కావాలని విన్నవించుకోగా సచి వాలయ నిధులు కేటాయించి సిమెంట్ రోడ్డు నిర్మించడం జరుగుతుందన్నారు. ఏఈ శ్రీనివాసరాజు, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి వెంకటనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్, సచివాలయ కన్వీనరు తమ్మిశెట్టి శ్రీనివాసులు, వల్లెపు వెంకటాద్రి, నారాయణ, బ్రహ్మయ్య, రమణయ్య పాల్గొన్నారు.

త్వరలో దర్గా కమిటీ ఎన్నికలు

- వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్



దర్గాలో కమిటీ ఎన్నికలపై పెద్దలతో చర్చిస్తున్న వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

ఆత్మకూరు: పట్టణంలోని సుల్తాన్ షాహీద్ దర్గా కమిటీకి ప్రభుత్వ నిబంధనల మేరక ఎన్నికలు నిర్వహించనున్నట్లు వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ వశీం అక్రమ్ తెలిపారు. పట్టణంలోని దర్గాను ఆయన బుధవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. దర్గా కమిటీ ఎన్నిక నిర్వహించే పరిస్థితులు ఏర్పడడంతో వక్ఫ్‌బోర్డు అధికారుల నిర్ణయం మేరకు అమలు చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఉన్న కమిటీ కోర్టుకు వెళ్లడంతో ఆ విషయం పెండింగ్‌లో ఉందన్నారు. ఇటీవల వెలువడిన ఆదేశాల మేరకు దర్గా, ఈద్గా, మసీదు కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం దర్గా అధీనంలో ఉన్న ఆస్తుల వివరాలను ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దర్గా మాజీ కమిటీ సభ్యులు మున్నా, మీరామొహిద్దీన్, రిజ్వాన్ పాల్గొన్నారు.

పాత ఇత్తడితో దేవుళ్ల విగ్రహాలు



కొలిమిలో కరిగించి ముడి ఇత్తడితో తయారు చేసిన దేవుళ్ల బొమ్మలు



కొలిమిలో కరిగించి దేవుళ్ల బొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): పాత ఇత్తడితో దేవుళ్ల విగ్రహాలు తయారు చేసస్తున్న స్థానిక ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రత్యేకంగా తయారు చేసిన అచ్చుల్లో అల్యూమినియం, ఇత్తడి పాత పనికిరాని వస్తువులను అక్కడికక్కడే తయారు చేసి ఒక్కో బొమ్మకు రూ.200 నుంచి రూ.400 తీసుకుంటుండడంతో ప్రజలు ఎగబడి బొమ్మలను తయారు చేయించుకున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కొలిమిలో ప్రజలు తీసుకొచ్చిన అల్యూమినియం, ఇత్తడిని కరిగించి ఒక బాక్స్‌లో చిన్నపాటి రసాయనాలను కలిపి దేవుళ్ల బొమ్మలు తయారు చేశారు. వెంకటేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహస్వామి, వినాయకుడు, బుద్ధుడు, శ్రీకృష్ణుడు, సాయిబాబా, సత్యనారాయణస్వామి తదితర దేవుళ్ల బొమ్మలను తయారు చేయించుకోవడానికి అధికంగా ఆసక్తి చూపారు.

ముస్లిం బాలురకు ఉచిత ఖత్నాలు



ఖత్నాలు చేయించుకున్న చిన్నారులు

ఉదయగిరి: స్థానిక చిన్నమసీదు సమీపంలోని ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం రహమతుల్‌లీల్ ఆలమీన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 120 మంది ముస్లిం బాలురకు ఉచిత ఖత్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ సంప్రదాయాన్ని ఇలాగే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు దస్తగిరి అహ్మద్, స్థానికులు ఎస్దానీ, జాఫర్ అహ్మద్, హుమయున్, మౌలానా ఆదం షఫీ, కలాం తదితరులు పాల్గొన్నారు.